క్లుప్తంగా

యర్రకుంటతండా వాసికి జూనియర్ లెక్చరర్ ఉద్యోగం


భూక్యా రాంబాబు

హుజూర్‌నగర్ (చింతల పాలెం) : టీజీపీఎస్సీ ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో చింతలపాలెం మండలం యర్రకుంటతండాకు చెందిన భూక్యా రాంబాబు జూనియర్ లెక్చరర్ (చరిత్ర) ఉద్యోగం సాధించాడు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఫలితాల్లో మల్టీ జోన్ 1, 2లో రాష్ట్ర స్థాయిలో 41 ర్యాంక్, మల్టీ జోన్ -2లో 18వ ర్యాంక్ కైవసం చేసుకున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షల కోసం తాను ఎక్కడా కోచింగ్ తీసుకోలేదని పట్టుదలతో, ఓ ప్రణాళిక ప్రకారం చదివినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు అభినందించారు.

డాక్టరేట్ పొందిన నాగన్నకు సన్మానం


యరగాని నాగన్నగౌడ్‌ను సన్మానిస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లోని ఇందిరా కళా వేదిక ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ నుంచి ఇటీవల సోషల్ సర్వీస్ ఎక్సలెంట్ గౌరవ డాక్టరేట్ అందుకున్న పట్టణానికి చెందిన ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్‌ను శనివారం రేషన్ డీలర్ల సంఘం నాయకులు పట్టణంలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అజ్మతుల్లా, మధు సువార్త, రాగం లింగయ్య, ధనమూర్తి, సుబ్బరాజు, నాగేశ్వరరావు, అచ్చిరెడ్డి, కాశయ్య, సుభాని పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

నడిగూడెం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను శనివారం మండల విద్యాధికారి ఉపేందర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వల్లాపురం, చాకిరాల, కొత్త చాకిరాల గ్రామాలలోని పాఠశాలల్లో విద్యార్థులు రిజిస్టర్ల ప్రకారం, యూడైస్ ప్రకారం ఉన్నారా.. లేరా అని పరిశీలించారు. సీఆర్పీలు నందిగామ రామారావు, రాజుల గురుస్వామి, ప్రధానోపాధ్యాయులు సూరమ్మ, బి.వెంకటేశ్వర్లు, సీహెచ్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రవీందర్‌రావు, ఉపేందర్‌రావు ఉన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా హుస్సేన్


హుస్సేన్

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అమరవరంలో సీపీఎం 8వ మండల మహా సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శిగా పోషణబోయిన హుస్సేన్‌ను తిరిగి రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యురాలు తంగెళ్ల వెంకటచంద్ర, నూకల లక్ష్మి, నర్సమ్మ, నాగమ్మ, భిక్షం, వెంకటరెడ్డి, వెంకటయ్య, ఖాసీం, నర్సింహాచారి, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

మునగాల : మండలంలోని విజయరాఘవపురంలో శనివారం ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అంజయ్య మాదిగ సమక్షంలో ఎమ్మార్పీఎస్ గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా కొత్తపల్లి వెంకటేశ్వర్లు , ఉపాధ్యక్షుడిగా సొంపంగు వినోద్, ప్రధాన కార్యదర్శిగా రెమిడాల రాజేష్, కార్యదర్శులుగా కత్తి నాగయ్య, రెమిడాల వంశీ, సహాయ కార్యదర్శిగా సొంపంగు సాయికిరణ్, కోశాధికారిగా కొత్తపల్లి నర్సయ్య, ప్రచార కార్యదర్శులుగా రవితేజ, సిద్దెల సిద్ధు, కత్తి వేణులను ఎన్నుకున్నారు. అంజయ్య మాట్లాడుతూ నల్లగొండలో ఈనెల 4న జరిగే ధర్మ యుద్ధ మహాసభకు మాదిగ వర్గాలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకొట్ల నాగరాజు, అంబేద్కర్ యువజన సంఘం గౌరవ సలహాదారులు రెమిడాల లింగయ్య, మాజీ ఉపసర్పంచ్ కత్తి కోటయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

హుజూర్‌నగర్ : పట్టణంలోని విద్యుత్ డీఈ కార్యాలయం ఆవరణలో ఆదివారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తునట్లు విద్యుత్ డీఈ వెంకటకిష్టయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల : పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులో గల ఎస్ఆర్ ఫ్రైడ్ ఫంక్షన్ హాల్ పక్కన బజారులోని ఎస్ఆర్‌కే అపార్ట్‌మెంటు సమీపంలో విద్యుత్ లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

చరిత్ర ఘనం.. అభివృద్ధి శూన్యం

- జీర్ణావస్థలో కోదండరామాలయం
- వందల ఎకరాల దేవాలయ భూములు అన్యాక్రాంతం
- సక్రమంగా కౌలు రాకపోవడంతో దూపదీప, నైవేద్యాలకు నిధులు కరువు
- పట్టించుకోని దేవాదాయశాఖ


నర్సింహాపురంలోని శ్రీకోదండరామస్వామి ఆలయం


అపరిశుభ్రంగా కోనేరు

మునగాల : మండలంలోని నర్సింహాపురం గ్రామ పంచాయతీలో ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీకోదండ రామస్వామి ఆలయం ఆలనపాలన కరువై జీర్ణావస్థకు చేరుకుంది. ఈ ఆలయానికి దాదాపు 690 ఏళ్ల చరిత్ర ఉంది. కానీ ప్రతి ఏటా ఆలయం కేవలం ఉత్సవాలకే పరిమితమైతోంది. స్వామివారు నిత్యపూజలకు నోచుకోవడం లేదు. అయితే ఈ ఆలయానికి పూర్వం 650 ఎకరాల భూమి ఉండేది. రానురాను భూమి అన్యాక్రాంతమై ప్రస్తుతం 11 ఎకరాలు మి గిలింది. ఈ 11 ఎకరాల భూమి మీద వచ్చే కౌ లుతోనే నేడు స్వామి వారి పూజలు, కల్యాణ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కానీ కౌలు కూడా సక్రమంగా రాకపోవడంతో నిత్య పూజలు కూడా కరువైపోతున్నాయి.

నిత్యపూజలకు దూరం..

రామాలయంలో 120 సంవత్సరాలుగా ముడుంబా వంశం వారు వంశపారంపర్యంగా అర్చకత్వం నిర్వహిస్తున్నారు. నేడు వారి మూడవ తరం వారసుడు ముడుంబా శేషాచార్యులు ఆలయ పూజారిగా కొనసాగుతున్నారు. కేవలం ఆలయ భూముల మీద వచ్చే కౌలు ఆధారంగానే పూజారి జీవనం, నిత్య పూజలు ఆధారపడి ఉన్నాయి. ఆలయానికి కమిటీ ఉన్నప్పటికీ కేవలం కార్తీక పౌర్ణమి రోజున స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు మాత్రమే పరిమితమైంది. ఆలయం ఎండోమెంట్ కింద నమోదై ఉన్నప్పటికీ దేవాదాయ శాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఈ ఆలయం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది.

కోనేరు అపరిశుభ్రం..

ఆలయం ప్రాంగణంలో కోనేరుకు ప్రత్యేకత ఉంది. ఈ కోనేటి నీరు స్వచ్ఛంగా కొబ్బరి నీటిని తలపించేలా తియ్యగా ఉండేదని ఈ ప్రాంత ప్రజలు చెపుతుంటారు. పూర్వం ఈ ప్రాంతవాసులు ఈ నీటినే తాగునీటిగా ఉపయోగించే వారు. కానీ నేడు కోనేటి పరిసర ప్రాంతం చెత్త, చెదారంతో అపరిశుభ్రమై అందులోకి మురుగునీరు వచ్చి చేరడంతో కోనేరు పూర్తిగా కలుషితమైంది. దీంతో కోనేరు వినియోగానికి పనికిరాకుండా పోయింది.

ఆలయం ప్రాచుర్యాన్ని కోల్పోయింది



ఎంతో ఘన చరిత్ర కలిగిన శ్రీకోదండ రామస్వామి ఆలయం నేడు ప్రాచుర్యాన్ని కోల్పోయింది. 37 ఏళ్లుగా ఇదే ఆలయంలో అర్చకత్వం నిర్వహిస్తున్నా. నేడు ఆలయంలో దూపదీప, నైవేద్యాలకు సరిపడా ఆదాయం లేదు. అయినప్పటికీ వారసత్వంగా వచ్చే అర్చకత్వాన్ని వదులుకోలేకపోతున్నా.

– ముడుంబా శేషాచార్యులు, ఆలయ పూజారి

అన్యాక్రాంతమైన భూములను గుర్తించాలి



ఎంతో చరిత్ర కలిగిన శ్రీకోదండ రామస్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ పట్టించుకోవడం లేదు. ఆలయ కమిటీ ఉన్నా కేవలం స్వామి వారి కల్యాణ మహోత్సవానికి పరిమితమవుతోంది. అన్యాక్రాంతమైన భూములను గుర్తించి ఆలయానికి చెందే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలి. ఆలయ పునరుద్ధరణకు దేవాదాయ శాఖ ముందుకు రావాలి.

– వేమూరి సత్యనారాయణ, సామాజిక ఉద్యమకారుడు, నర్సింహాపురం

కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డికి సన్మానం


డీఎస్పీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కోదాడరూరల్ : కేంద్ర హోం మంత్రి దక్షతా పురస్కారానికి ఎంపికైన కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్ రెడ్డిని శనివారం కోదాడలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు భాషబోయిన భాస్కర్‌రావు ఆధ్వర్యంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నేర పరిశోధనలో ఆయన చూపిస్తున్న ప్రతిభకు ఈ అవార్డు రావడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మూసి శ్రీనివాసరావు, టి.రామయ్య, చారగండ్ల సత్తయ్య, తమ్మనబోయిన వీరబాబు, చాపల శ్రీను, అల్లి వీరబాబు, వెంకన్న, చిలక రమేష్, నాగరాజు తదితరులు ఉన్నారు.

లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

కేంద్ర హోం మంత్రి దక్షతా పురస్కారానికి ఎంపికైన డీఎస్పీ శ్రీధర్‌రెడ్డిని కోదాడ లారీ అసోసియేషన్ నాయకులు శనివారం కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ రామినేని శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ఆలేటి రాంబాబు, కృష్ణ, నరసయ్య, నరసింహారావు తదితరులు ఉన్నారు.

అవార్డు రావడం కోదాడ ప్రాంతానికి గర్వకారణం

కోదాడ : నేర పరిశోధనలో అత్యుత్తమ ప్రతిభ చూపి కేంద్ర హోంమంత్రి దక్షితా పతకానికి ఎంపికైన కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డిని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వెంపటి వెంకటేశ్వరరావు శనివారం ఆయన కార్యాలయంలో కలిసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదాడ ప్రాంతంలో ఎస్ఐగా, సీఐగా, డీఎస్పీగా సేవలందిస్తూ కేంద్ర ప్రభుత్వ అవార్డుకు ఎంపిక కావడం ఈ ప్రాంత వాసులకు ఎంతో గర్వకారణమని అన్నారు.

రైల్వే ట్రాక్ వెంట దారి కోసం ప్రతిపాదనలు

మేళ్లచెరువు : మండలంలోని రామాపురం గ్రామం పరిధిలో నిర్మించిన రైల్వే ట్రాక్ వెంట పొలాలకు వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రైతులు దారి కోసం రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేశారు. శనివారం మఠంపల్లి రైల్వే స్టేషన్ అధికారి రాంబాబు రామాపురం వద్దకు సమస్యను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పొలాలకు వెళ్లే దారి కోసం ప్రతిపాదనలు పంపిస్తామని ఆయన తెలిపారు.

విద్యార్థికి ప్రోత్సాహకం

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన కంపా శైలజ ఇంటర్‌లో స్టేట్ సెకండ్ ర్యాంక్, టౌన్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. శనివారం పట్టణంలో విద్యార్థికి కౌన్సిలర్ జక్కుల శంబయ్య.. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్, ఉపాధ్యక్షుడు జక్కుల మల్లయ్య చేతుల మీదుగా రూ.5 వేల ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిని సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, అమర్‌నాథ్ రెడ్డి, వెంకట్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని గెలిపించాలి

మోతె : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యూటీఎఫ్ మోతె మండల నాయకులు కోరారు. శనివారం మండలంలోని సిరికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.లాలు మాట్లాడుతూ నర్సిరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యారంగ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి డి.నరేందర్, ఉపాధ్యాయులు శ్రీనివాసచారి, మారయ్య, రాంబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

హృద్రోగ మరణాలు అరికట్టాలి

హుజూర్‌నగర్ : రోజురోజుకు పెరుగుతున్న హృద్రోగ మరణాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పౌర స్పందన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. క్రాంతికుమార్ అన్నారు. శనివారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు.ప్రభుత్వం ప్రజలందరికీ ఉచిత గుండె పరీక్షలు నిర్వహించాలని కోరారు. ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో వేదిక నాయకులు ఆంజనేయులు, వెంకటరెడ్డి, రత్నకుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మఠంపల్లి : మండలంలోని భీల్యానాయక్‌తండాలో అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన వాంకుడోతు రాజేశ్వరికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆమె భర్త రంగాకు మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాబునాయక్ శనివారం అందజేశారు. ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రాముడునాయక్, నాగరాజునాయక్ తదితరులు ఉన్నారు.

కుటుంబ సర్వేను జయప్రదం చేయాలి


నడిగూడెంలో ఇళ్ల గుర్తింపును పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ


మఠంపల్లి : యతవాకిళ్లలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న అధికారులు


చిలుకూరులో ఇంటి నంబర్లు వేసే ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ ధృవకుమార్

నడిగూడెం : సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతం చేయాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ కోరారు. సర్వేలో భాగంగా శనివారం మండల కేంద్రంలో ఇళ్ల గుర్తింపును ఆయన పరిశీలించి అనంతరం ఎన్యుమరేటర్లతో మాట్లాడారు. ఈ నెల 6 నుంచి 18వ తేదీ వరకు సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ వి.సరిత, ఎంపీడీఓ సయ్యద్ ఇమామ్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

యాతవాకిళ్లలో ఇంటింటి సర్వే

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లలో అధికారులు శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల వివరాలు సేకరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, ఈజీఎస్ టీఏ బుంగయ్యలు మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ వరకు ఇళ్ల వివరాలు సేకరించి 6 నుంచి సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎఫ్ఏ భిక్షం, పంచాయతీ సిబ్బంది సుధాకర్, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

కుటుంబ సర్వే సమర్థవంతంగా నిర్వహించాలి

చిలుకూరు : సమగ్ర కుటుంబ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ ధృవకుమార్ అన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా శనివారం చిలుకూరులో చేపట్టిన ఇంటి నంబర్లు వేసే ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇంటి నంబర్ల ప్రకారం ప్రతి ఎన్యుమరేటర్‌కు 150 నుంచి 175 ఇళ్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిరిబాబు, ఎంపీఓ జగదీష్, ఆర్ఐలు మంత్రిప్రగడ సీతయ్య, శ్వేత, ఏఎస్ఓ అశోక్, గ్రామ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్.. ఒకరికి గాయాలు

మోతె: కూలీలతో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మోతె మండలం రావిపహాడ్ గ్రామంలో శనివారం జరిగింది. ఆత్మకూర్ (ఎస్) మండలం లక్ష్మణనాయక్‌తండా పరిధిలోని పొట్టి సూర్యాతండాకు చెందిన కూలీలు శెట్టిగూడెంలో పత్తి ఏరేందుకు శనివారం ఉదయం ఆటోలో వెళ్తున్నారు. మోతె మండలం రావిపహాడ్ గ్రామ శివారులో ఆటోకు గేదెలు అడ్డురావడంతో డ్రైవర్ స్లో చేశాడు. అదే సమయంలో వెనుక నుంచి కూలీలతో వస్తున్న ట్రాక్టర్ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో వెనుక కూర్చున్న సబావత్ జ్యోతి రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో రోడ్డు పక్కన కంప చెట్లలోకి దూసుకెళ్లింది. ఆటోలో చిక్కుకున్న కూలీలను స్థానికులు బయటకు తీశారు. స్థానికులు జ్యోతిని 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆలయానికి రాతి ధ్వజస్తంభం బహూకరణ

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని భద్రావతి భావనారుషి దేవాలయానికి గజ్జెల శంకర్‌రెడ్డి రూ. 1.25 లక్షల విలువ గల రాతి ధ్వజస్తంభాన్ని అందజేసినట్లు పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు ఎం.సాయికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దాతను పలువురు అభినందించారు

ఆర్‌జీఏ సంస్థ బాధితులకు న్యాయం చేయాలి

మునగాల : ఆర్‌జీఏ ప్రైవేటు సంస్థలో ఆన్‌లైన్ ద్వారా లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి మోసపోయి తీవ్రంగా నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని మునగాలకు చెందిన సామాజిక కార్యకర్త జి.సైదులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఆర్‌జీఏ సంస్థలో సూర్యాపేట జిల్లాకు చెందిన పేదలు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టారని తీరా సంస్థ మూసివేయడంతో వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. బాధితులు సంస్థలో పెట్టిన పెట్టుబడిని తిరిగి ఇప్పించాలని సైదులు కోరారు.

రాష్ట్ర ప్రభుత్వానివి మోసపూరిత హామీలు

గరిడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వానివి మోసపూరిత హామీలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సీపీఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీలో పాలకులు రోజుకో ప్రకటన చేస్తూ కాలం గడుపుతున్నారని అన్నారు. అర్హులందరికీ రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు ఎడ్ల అంజిరెడ్డి, కడియాల అప్పయ్య, రైతు సంఘం నాయకులు అంబటి గోవిందరెడ్డి, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు వంగ సైదులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బచ్చలకూరి ప్రసాద్

గరిడేపల్లి : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బచ్చలకూరి ప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల4న నల్లగొండలో జరిగే ధర్మయుద్ధ మహాసభకు ఎమ్మార్పీఎస్ నాయకులు, అనుబంధ సంఘాల కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒగ్గు విశాఖ, బుడిగ వెంకన్న, చింతలచెరువు బాబు, కొత్తపల్లి సుధాకర్, పిట్ట రవి, శ్రీను, లాజర్, సైదులు, ఉపేందర్, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్న బీజేపీ

- మల్లు నాగార్జునరెడ్డి


హుజూర్‌నగర్ : సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : దోపిడీ రాజ్యం పోయి, కష్ట జీవుల రాజ్యం రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అమరవరంలో నిర్వహించిన ఆ పార్టీ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనేక దేశాల్లో పెట్టుబడి వ్యవస్థకు వ్యతిరేకంగా సోషలిస్టు రాజ్యాలు ఆవిర్భవిస్తున్నాయని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం సామాన్యుల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసి కార్పొరేట్ సంస్థలకు మాఫీల రూపంలో దోచిపెడుతుందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న ఉచిత బస్సు సౌకర్యం గ్రామీణ మహిళలకు శాపంగా మారిందని ఎద్దేవా చేశారు. గ్రామీణ ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలని, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు అందజేయడంతో పాటు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగారపు పాండు, జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, మండల కార్యదర్శులు హుస్సేన్, బాబునాయక్, శీలం శ్రీను, వెంకటచంద్ర, వీరయ్య, నర్సింహాచారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

హుజూర్‌నగర్ : ప్రజా పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మిన సీపీఎం నాయకుడు, మాజీ ఎంపీటీసీ పాశం నరసయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం పట్టణానికి చెందిన సీపీఎం నాయకులు పి.నరసయ్య సంస్మరణ సభ స్థానిక కౌండిన్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరసయ్య ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని కోరారు. సభలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు తన్నీరు మల్లికార్జున్, యరగాని నాగన్న, గొట్టే రామయ్య, ఎం.వెంకటేశ్వర్లు, పి.శేఖర్‌రావు, ఎస్.వెంకటేశ్వర్లు, వై.రాములు, ఎస్.పాండు, పల్లె వెంకటరెడ్డి, నరసయ్య కుమారులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ.. ప్రజా ఉద్యమాలకు ఊపిరి


ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్

హుజూర్‌నగర్ : ప్రజా ఉద్యమాలకు సీపీఐ ఊపిరి అందించిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సీపీఐ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజూర్‌నగర్‌లో ఈనెల 9న పార్టీ 100 ఏళ్ల ఆవిర్భావ వేడుక నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు దేశంలో అనేక నిర్బంధాలను, కేసులను లెక్క చేయకుండా కష్ట జీవుల పక్షాన నిలిచారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి దొంతగని సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు యల్లావుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక మాస పూజలు


నేరేడుచర్ల : అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


హుజూర్‌నగర్ : భీమలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలో ప్రసిద్ధిగాంచిన పార్వతీ భీమలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం గోపూజతో కార్తీక మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలను ఆలయ పూజారులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గోవుతో కలిసి ఆలయ ప్రదక్షిణం చేశారు. సాయంత్రం ఆలయంలో ఆకాశ దీపం వెలిగించారు. కార్యక్రమాలలో ఈఓ కొండారెడ్డి, ప్రముఖులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : కార్తీక మాసం శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నేరేడుచర్ల పట్టణంలోని అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో తొలిరోజు స్వామివారికి ఆలయ అర్చకుడు ఉగ్రదండి శివప్రసాద శర్మ ప్రత్యే అభిషేకాలు చేశారు. ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ రాచకొండ రామకోటేశ్వర్‌రావు పర్యవేక్షించారు.


గరిడేపల్లి : శ్రీలక్ష్మీనరసింహస్వామికి పూజలు చేస్తున్న మాలధారులు, భక్తులు

శ్రీలక్ష్మీనరసింహస్వామికి పంచామృతాభిషేకం

గరిడేపల్లి : కార్తీక మాసం సందర్భంగా గరిడేపల్లి మండల కేంద్రంలోని శివాలయంలో గల శ్రీలక్ష్మీనరసింహస్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని నూతన వస్త్రాలతో అలంకరించి నీరాజనం మంత్రపుష్పాలు సమర్పించారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దీక్షాస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం

నేరేడుచర్ల : ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుపులేటి నర్సింహారావు అన్నారు. శనివారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే వచ్చిన వ్యతిరేకతతో ప్రజలు రోడ్లపైకి వచ్చారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపడుతున్నట్లు ప్రకటించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందంటే కేసీఆర్ ఘనతేనని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఎల్.నాగార్జున, నాయకులు బచ్చలకూరి నాగశేఖర్, నాగులవంచ వాసు, కొత్త నాగయ్య తదితరులు ఉన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

మేళ్లచెరువు : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు భాగ్యరాజ్ అన్నారు. శనివారం మేళ్లచెరువు మండల కేంద్రంలోని కృషి విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడలతో విద్యార్థులకు శరీర దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో కుంకుమార్చన

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం సహస్రనామ కుంకుమార్చనను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, సహస్రనామ కుంకుమార్చన, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, శ్రీగోదాదేవికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శత నామావళి, అలంకరణ, గోపూజ, నిర్వహించారు. సాయంత్రం సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారిని బూరుగడ్డ, మాచవరం గ్రామాల్లో ఊరేగించారు. ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఈఓ ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, ధర్మకర్తలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

యువతకు జీవన భృతి కల్పించాలి

మునగాల: యువతకు స్వయం ఉపాధి పథకాల ద్వారా జీవనభృతి కల్పించాలని మండల కేంద్రానికి చెందిన ప్రముఖ న్యాయవాది మిర్యాల మంగయ్య గౌడ్ కోరారు. శనివారం ఆయన మునగాలలో విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. డిగ్రీ, ఆపైన చదివిన నిరుద్యోగులకు ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించలేకపోతున్నందున యువత చెడు మార్గాల వైపు మొగ్గు చూపుతున్నారని, మానసిక వేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. వారికి అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఈమేరకు శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఈ మెయిల్ పంపినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆత్మల పండుగ


సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ మార్టిన్‌పసల, క్రైస్తవులు

మఠంపల్లి: మఠంపల్లి, రఘునాథపాలెంలో క్రైస్తవులు ఆత్మల పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా స్థానిక క్రైస్తవ శ్మశాన వాటికల్లో సమాధులను రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలు, కొవ్వొత్తులతో అందంగా అలంకరించారు. ఈసందర్భంగా మఠంపల్లి శుభవార్త చర్చి ఫాదర్ మార్టిన్ పసల ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతికిషోర్‌రెడ్డి, గాదె జయభారత్‌రెడ్డి, గాలి చిన్నపురెడ్డి, గాదె లూర్దుమరెడ్డి, ఆంథోనిరెడ్డి, జార్జిరెడ్డి, ఇన్నారెడ్డి, టీఆర్‌బాలశౌరెడ్డి, ఆనందరెడ్డి, థామస్‌రెడ్డి, బాలరెడ్డి, ప్రకాష్‌బాబు, జోసెఫ్‌కాకుమాను, రాయలు, జోసెఫ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లూర్దురెడ్డి, విక్టర్ రెడ్డి పాల్గొన్నారు.